RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

# అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 315 అక్టోబర్ 4 ఆదివారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

## ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై

# సీఎం స్పెషల్ ఫోకస్

విజయవాడ, అక్టోబర్ 3 : ఏపీ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. విజయవాడ అంబేడ్కర్ కళావేదికలో ఈరోజు (శనివారం) జరిగిన పాన్ ఐఐటీ సమ్మిట్‌లో టెక్నాలజీ ఆవిష్కరణలను సీఎం ప్రోత్సహించారు.

పాన్ ఐఐటీ సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు.

ఆ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలి..

ఆక్సి ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన డ్రోన్‌ను పరిశీలించారు. ఆ సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు డ్రోన్‌పై సంతకం చేశారు.

అలాగే, వివిధ స్టార్టప్‌లు, ఐఐటీయన్ల నూతన ఆవిష్కరణలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పెట్రోలుతో నడిచే టూవీలర్లను గంటల్లో ఈవీలుగా కన్వర్ట్ చేసే సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు. సాధారణ వాహనాలను ఈవీలుగా కన్వెర్ట్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

చిన్నారులకు సీఎం అభినందనలు..

ముఖాన్ని స్కాన్ చేసి హెల్త్ రిపోర్టు ఇచ్చే యాప్ తయారు చేసిన సంస్థ స్టాల్‌ను కూడా సందర్శించారు. నిమిషాల వ్యవధిలో ప్రాథమిక రిపోర్టు ఇవ్వగలమని సీఎంకు సదరు సంస్థ ప్రతినిధులు వివరించారు. స్వర్ణాంధ్ర-10 సూత్రాల అమల్లో టెక్నాలజీ వినియోగం ద్వారా సమర్థవంతంగా అమలు చేసే అంశంపై తమ ఐడియాలను ముఖ్యమంత్రికి వివరిస్తూ చిన్నారులు ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు. చిన్నారులతో కలిసి సీఎం చంద్రబాబు గ్రూప్ ఫొటో దిగారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

అక్టోబర్ 3 : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందు కోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

## చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్

అక్టోబర్ 3 : కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు



పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు

# పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ పై ఉక్కు పాదం

**• డిప్యూటీ తాహసిల్దార్ ఫణి కుమార్**

కొల్లూరు, అక్షర ప్రకాశం : కొల్లూరు మండలం కొల్లూరు గ్రామంలోని జగనన్న కాలనీలో అద్దెకు తీసుకున్న గృహంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన సామా సత్యనారాయణపై క్రిమినల్ కేసుతో పాటు నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు చేశారు. కొల్లూరు గ్రామం కుర్రా వారి వీధి, డోర్ నంబర్ 15-55లో నివాసం ఉంటున్న సామా సత్యనారాయణ, తండ్రి లేటు ఆంజనేయులు, జగనన్న కాలనీలోని ఓ గృహాన్ని అద్దెకు తీసుకుని ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది.

దీంతో శనివారం తెల్లవారుఝామున అధికారులు సదరు గృహంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 80 తెల్ల ప్లాస్టిక్ మూటల్లో ఒక్కో మూటకు 50 కిలోల చొప్పున మొత్తం 40 క్వింటాళ్ల (4,000 కిలోల) ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, గతంలో జూలై 20న కొల్లూరు గ్రామంలోని ఉప్పు బజారులో ఉన్న సామా సత్యనారాయణ స్వగృహంలో కూడా 20 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు చేశారు. గతంలో కేసు నమోదైనప్పటికీ ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యంతో అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించడంతో సామా సత్యనారాయణపై కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో పౌర సరఫరాల శాఖ సిబ్బంది ఫణికుమార్, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్, కొల్లూరు-3 గ్రామ రెవెన్యూ అధికారి నన్నెపాముల రాంబాబు, మధ్యవర్తులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి సత్యసాయి సేవలో మాడుగుల భక్తులు

**- అక్టోబర్ 6 వరకు కొనసాగనున్న ఆధ్యాత్మిక సేవా యాత్ర**

**- అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా హాజరు**

మాడుగుల, అక్షర ప్రకాశం : శ్రీ సత్యసాయి సేవా యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల మండలానికి చెందిన సుమారు 60 మంది భక్తులు పుట్టపర్తి చేరుకుని స్వామివారి సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అక్టోబర్ 3న ప్రారంభమైన ఈ సేవా యాత్ర ఈ నెల 6వ తేదీ వరకు (శని, ఆది, సోమవారాల్లో) ప్రశాంతి నిలయంలో అత్యంత వైభవంగా కొనసాగనుంది. ఈ యాత్రలో మాడుగుల భక్తులతో పాటు జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది భక్తులు తరలివచ్చి నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా భక్తులు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి బాబా రథయాత్ర, సాయి అష్టోత్తర శతనామావళి పూజలు, పవిత్ర చిత్రావతి నది వద్ద హారతి మహోత్సవం, సామూహిక వ్రతాలు మరియు భజన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపడుతున్నారు. పుట్టపర్తి దివ్య సన్నిధిలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు, పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం తమకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని ఇస్తోందని మాడుగుల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల నామస్మరణలు, భజనలతో పుట్టపర్తి ప్రాంగణం భక్తిపారవశ్యంతో మార్మోగుతోంది.

# ప్రజల ప్రాణాలతో ఆర్అండ్‌బీ చెలగాటం!

**● ఆరు నెలలకే రోడ్డుపై 'మృత్యుకుహరం'.. నెల రోజులుగా చోద్యం చూస్తున్న అధికారులు**

**● ఎవరైనా బలైతేనే స్పందిస్తారా? నాసిరకం పనులపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం**

వి.మాడుగుల, అక్షర ప్రకాశం : కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్డు ఆరు నెలలు కూడా గడవకముందే అధ్వానంగా మారడం ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యానికి, నాణ్యతా లోపానికి నిదర్శనంగా నిలుస్తోంది. వి.మాడుగుల ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి పాడేరు వెళ్లే మార్గంలో, జంక్షన్‌కు కేవలం 200 మీటర్ల దూరంలోనే రోడ్డు నడిబొడ్డున భారీ గుంత ఏర్పడింది.

నెల రోజులుగా ఈ మృత్యుకుహరం వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కురుస్తున్న వర్షాలకు గోతిలో నీరు చేరి చెరువులా మారడంతో లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. పగటి పూటే పరిస్థితి ఇలా ఉంటే, రాత్రివేళల్లో ఏ క్షణాన ఏ ప్రాణం గాల్లో కలుస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కనీసం అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. ఈ ప్రమాదంపై ఆర్అండ్‌బీ శాఖ ఈఈ రమేష్, డీఈ మూర్తిలను శనివారం నాడు ఫోన్లో వివరణ కోరగా.. 'పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అంటూ దాటవేత ధోరణి ప్రదర్శించడం విడ్డూరం. నెల రోజులుగా కనిపించని దుస్థితిని పరిశీలించడానికి ఇంకా ఎవరి ప్రాణాలు పోవాలని ప్రజలు నిలదీస్తున్నారు. అధికారులు తాత్కాలిక పూడ్చివేతలతో చేతులు దులుపుకోకుండా, తక్షణమే శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలి. నిబంధనలు గాలికొదిలేసిన కాంట్రాక్టర్‌పై, పర్యవేక్షణ విస్మరించిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.

# గుడిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ మా, అంగన్‌వాడీ ఉత్సవం

రాచర్ల, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా రాచర్ల మండలంలోని రాచర్ల సెక్టార్ పరిధిలోని గుడిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మా, అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎన్. బాలమ్మ ఆధ్వర్యంలో, సూపర్‌వైజర్ వనంతకుమారి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు, సేవలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ప్రతి కుటుంబం పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. అంగన్‌వాడీ ఉత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త ఎన్. బాలమ్మ, ఆయమ్మ ఎం. లక్ష్మీదేవి (సి.నెం.113) లను లబ్ధిదారులు, గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో ఉత్సాహంగా ప్రారంభమైన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

పిఠాపురం, అక్షర ప్రకాశం : పిఠాపురం ఆర్‌ఆర్‌బి హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19వారు ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి ఆర్చరీ, ఫెన్సింగ్, మోడరన్ పెంతతులాన్, కలరిపట్టు,

మొత్తం ఐదు క్రీడల విభాగంలో పిఠాపురం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ లో జరిగాయి. ఈ ఎంపికలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నల మూల నుండి 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో 80 మంది వివిధ విభాగాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఎంపికలను పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి ఆర్ కె రెడ్డి అధ్యక్ష వహించి ఎంపికలను ప్రారంభించారు. అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సెలక్షన్స్ కమిటీకి న్యాయ నిర్ణయతలగా పి లక్ష్మణరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ పళ్ళ సురేష్, హుస్సేన్ మరిలాల్, స్టాఫ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు**

బాపట్ల, అక్షర ప్రకాశం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలను స్వీకరించారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కా రానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. బాధితులకు త్వరిత గతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. ప్రజా దర్బార్ ద్వారా తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# నేషనల్ హైవేపై ప్రమాదకర ఫ్లెక్సీలను వెంటనే తొలగించండి!

**- ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన అక్రమ ఫ్లెక్సీలపై పటిష్ట చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మాదాసు భాను ప్రసాద్ విజ్ఞప్తి!**

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : జాతీయ రహదారిపై వాహనదారుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్న అక్రమ ఫ్లెక్సీలు, హోర్డింగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ We The People of india కన్వీనర్, సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి లేఖ రాశారు.

ముఖ్యమైన విజ్ఞప్తులు:

అక్రమ ఫ్లెక్సీల తొలగింపు: కూడళ్లు, మలుపులు మరియు నేషనల్ హైవే సూచిక బోర్డులపై దృష్టి మళ్లించేలా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించి, శాశ్వత నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

రోడ్డు భద్రతా ప్రమాణాలు: ఆగస్టు 27న జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది బలికావడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, కేవలం కంటి తడుపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

ప్రాథమిక వసతుల కల్పన: హైవేపై వెలగని వీధి

దీపాలను పునరుద్ధరించాలి.

రోడ్ మార్కింగ్స్: స్పీడ్ బ్రేకర్లపై జీబ్రా గీతలు, అవసరమైన హెచ్చరిక బోర్డులు మరియు రోడ్ మార్కింగ్స్ తక్షణమే ఏర్పాటు చేయాలి. చిలకలూరిపేట హైవేపై ఉన్న భద్రతా పరిస్థితులను పునఃసమీక్షించి అధికారులను ఆదేశించాలని కోరిన ఈ కార్యక్రమంలో కందా భాస్కర్, హరి ప్రసాద్, అడప రవి, మరుకొండ వెంకటరావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జన్మదిన వేడుకలు

గిద్దలూరు, అక్షర ప్రకాశం : గిద్దలూరు వాసవి క్లబ్ వి 207ఏ రీజియన్ ఎత్రీ గిద్దలూరు రీజియన్ చైర్మన్ ఆరవీటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గిద్దలూరులోని సంజీవని వృద్ధాశ్రమం నందు వృద్ధులకు పిల్లలకు భోజనము ఏర్పాటు చేయడమైనది. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కొల్లి నాగరాజు వాసవి యూత్ క్లబ్ ప్రెసిడెంట్ చీతి రాల సుదర్శన్ వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ గరే సాహితీవనిత క్లబ్ సెక్రటరీ ఆరవీటి రజిని జోన్ చైర్మన్ సూరే రామచంద్రుడు ఐపిసి కందగట్ల వెంకటరమణ రీజనల్ చైర్మన్ ఆరవీటి చంద్రశేఖర్ పాల్గొని జయప్రదం చేయడం జరిగినది.

# గత 27 నెలల నుండి ప్రతి శనివారం దాతల సహాయం మహా అన్నదాన కార్యక్రమం

• శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో

కారంపూడి, అక్షర ప్రకాశం : పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల శ్రీ ప్రసన్నాంజనేయ

స్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం దాతల సహాయంతో శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుంది. ఈరోజు దాతలుగా కీ"శే"గుండాల రామయ్య జ్ఞాపకార్థం 150 మందికి సహకరించిన వారు ధర్మపత్ని గుండాల రమణమ్మ వారి కుమారుడు గుండాల వెంకటేశ్వర్లు (GVR) ధర్మపత్ని భూలక్ష్మి కూతుర్లు అల్లుళ్ల మనవళ్లు, మనవరాలు కుటుంబ సభ్యులు, మరో 150 మందికి సహకరించిన వారు ఇల్లూరి పుల్లయ్య ధర్మపత్ని ఆదిలక్ష్మి ఒప్పిచర్ల, తొలిచూరి శరత్ బాబు ధర్మపత్ని భాగ్యలక్ష్మి కార్తికేయ పౌల్ట్రీ ఫీడ్స్, గుంటూరు, పిన్నెల్లి నాగరాజు ధర్మపత్ని లక్ష్మీ కోటమ్మ ఓపిచర్ల ఈ దాతలు సహాయంతో 300 మందికి భోజనాలు నిర్వహించడం జరిగినది.

దాత గుండాల వెంకటేశ్వర్లు (GVR) మాట్లాడుతూ ఈరోజు మాలయ పక్షాల్లో శనివారం రోజున అన్నదానం చేయటం చాలా సంతోషం గా ఉందని ఒక మనిషి ఆకలి తీర్చడం గొప్ప సంకల్పం ఇటువంటి కార్యక్రమానికి దాతలుగా ముందుకు వచ్చి సహకరించాలని కొనియాడారు. ఈ నారాయణ సేవా కార్యక్రమంలో శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి. రామారావు, సభ్యులు కొత్తమాసు వెంకట రామ్మోహన్ రావు, అన్నప్రసాద మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, పల్లా పద్మ, చింతల శారద, వుటుకూరి వాణి, సూరేధనలక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, గుండా మహేశ్వరి, సముద్రాల పద్మ, ఊటుకూరి వెంకాయమ్మ, గుండా ప్రసన్న, గుండా కమల కుమారి, తదితరులు ఈ నారాయణ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వరికి తెగులు కాటు.. రైతు కంట కన్నీరు!

• ఎదిగే దశలోనే నాశనమవుతున్న పంటలు

• వేలకు వేలు మందులు కొట్టినా దక్కని ఫలితం.. అప్పుల ఊబిలో అన్నదాతలు

• పట్టించుకోని వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు

వి. మాడుగుల, అక్షర ప్రకాశం : రెక్కలు ముక్కలు చేసుకుని, వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడిగా పెట్టిన వరి పంటలను తీవ్రమైన తెగుళు కబళిస్తున్నాయి. చేతికందుతుందనుకున్న పంట ఎదిగే దశలోనే తెగుళ్ల బారిన పడి ఎందుకు పనికి రాకుండా పోతుండటంతో అన్నదాతలు లబోదిబోమం టున్నారు. మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో ఇదే దయనీయ పరిస్థితి నెలకొన్నప్పటికీ, సంబంధిత వ్యవసాయ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కనీసం క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించకపోవడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తోంది. మందులు కొట్టినా తగ్గని తెగులు.. రైతు ఆవేదన: మాడుగుల మండలంలోని ఎం. కోడూరు గ్రామానికి చెందిన రైతు సియాద్రి రామారావు తనకున్న పొలంలో దమ్ము చేసి ఎంతో ఆశతో వరి నాట్లు వేశారు. అయితే నాట్లు వేసిన కొద్ది రోజులకే పైరుకు గుర్తుతెలియని తెగులు ఆశించింది. పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి వేలాది రూపాయల విలువైన రకరకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినప్పటికీ ఎలాంటి మార్పూ రాలేదు. తెగులు ఉధృతి తగ్గకపోవడంతో పైరు ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయి ఎండిపోతోందని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరైందని, చివరకు తాము అప్పుల ఊబిలో కూరుకుపోయే దుస్థితి వచ్చిందని వాపోయారు. మండల వ్యాప్తంగా తెగుళ్ల సమస్య తీవ్ర రూపం దాల్చుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు కంటితుడుపు చర్యలతో కాలం గడుపుతున్నారే తప్ప, పంట పొలాలను పరిశీలించి రైతులకు సరైన మార్గదర్శనం చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు.

# ఎఫ్.కె.పాలెంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

- పోషణ, మాతృ సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు

పిఠాపురం, అక్షర ప్రకాశం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ ఉత్సవాలు పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెం దళితపేటలోని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్.లక్ష్మి, సీడీపీఓ సి.హెచ్.ఎస్.కె. దుర్గాదేవి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖతో పాటు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా పోషణ, మాతృ సంరక్షణ, చిన్నారుల టీకాలు, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి అనుభవాలను తెలుసుకుని, వారి అభిప్రాయాలను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తించి ప్రోత్సహించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# పాకలలో కట్టుదిట్టంగా విద్యా కమిటీ ఎన్నిక

సింగరాయకొండ, అక్షర ప్రకాశం : సింగరాయకొండ మండలం పాకలలో విద్యాకమిటీ ఎన్నిక శనివారం ఉత్కంఠగా సాగుతోంది. పాకల ZPHS వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అధికార, ప్రతిపక్ష శ్రేణులు భారీగా మోహరించడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. అయితే అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినవి. విద్యా కమిటీ ఎలక్షన్‌లో గెలుపొందిన అభ్యర్థులను టిడిపిమండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, క్లస్టర్ ఇంచార్జి కూనపరెడ్డి సుబ్బారావు, ఎస్సీ సెల్ నాయకుడు, సుదర్శి చంటి, సైకం చంద్రశేఖర్ తదితరులు శాలువాతో సత్కరించారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,